ప్రజాశక్తి
బుధవారం 24 జులై 2024
5
అల్లూరి సీతారామరాజు



బాధితులను ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు :ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులకు ప్రభుత్వపరంగా పరిహారమిచ్చి ఆదుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర కోరారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వర్షాలు, వరదల ఉధృతికి మూడు జిల్లాలలోనూ వందల ఎకరాల్లో వరినారుమళ్లు నీటమునిగాయని, చెట్లు కూలి అనేక ఇళ్లకు నష్టం వాటిలిందనానరు. అల్లూరి జిల్లాలో అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యం తెగిపోవడంతోపాటు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయన్నారు. వర్షాల వల్ల వరి, పసుపు, వేరుశనగ, రాగులు, జొన్నలు, చిరుధాన్యాలు ఇతర పంటలకు వాటిల్లిన నష్టంపై రెవెన్యూ వ్యవసాయాధికారులతో సర్వేచేయించి, పంట నష్టాలను అంచనా వేసి ఆదుకోవాలన్నారు అలాగే ఇళ్లు కోల్పోయిన వారికి, పిడుగుపాటు, ఇతరత్రా కారణాలతో గేదెలు, ఆవులు, జీవాలు కోల్పోయిన వారికి బీమాతో సంబంధం లేకుండా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అత్యవసరమైతే తప్పప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావద్దని కోరారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

- జల దిగ్బంధంలోనే గ్రామాలు
- నిర్వాసితుల గుండెల్లో గుబులు
- పునరావాస కేంద్రాలకు తరలివెళ్తున్న బాధితులు
- జాతీయ రహదారిపైకి వరద నీరు
- నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి-చింతూరు

గోదావరి వరద ఉధృతి కొనసాగుతోంది. విలీన మండలాల్లోని పలు గ్రామాలు నేటికీ జలదిగ్బంధంలోనే ఉన్నాయి. దీంతో పలు గ్రామాల నుండి బాధితులు పునరావాస కేంద్రాలకు తరలివెళ్తున్నారు. కొండలు, గుట్టలపైనా పాకలు వేసుకొని అక్కడికి వెళ్తున్నారు. మరో జాతీయ రహదారిపైకి వరద నీరు చేరడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

2022 నాటి వరదలను తలపించేలా గోదావరి నీటిమట్టం పెరుగుతూ వచ్చింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం ఉదయం 51.6 అడుగులకు చేరగా, మధ్యాహ్నం సమయానికి 51.3 అడుగులకు స్వల్పంగా తగ్గింది. చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 39 అడుగుల నుండి 40 అడుగులకు చేరింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో పేరూరు, వాజేడు, తాళి పేరు, దుమ్ముగూడెం నుండి వచ్చే వరదలు కొంతమేర తగ్గుముఖం పట్టడంతో శబరి, గోదావరి వరద ఉధృతి నిలకడగా కొనసాగుతోంది. రెండు రోజుల నుండి వరద నీరు తగ్గకపోవడంతో చింతూరు మండల కేంద్రానికి చుట్టుపక్కల 60 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చట్టి జాతీయ రహదారి-30పైకి కుమ్మూరు వాగు వరద నీరు వచ్చి చేరడంతో రహదారిపై వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. చింతూరు శబరి ఒడ్డు నిర్వాసితులు ఎర్రంపేట ఎపిఆర్‌జెసి,స్కైట్ సెంటర్ పునరావాస కేంద్రాల్లో మొత్తం 461 జనాభా ఉన్నారు. 31 కేంద్రాల వద్ద ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బందిని ఏర్పాటు చేశారు.

ఎటపాక : గోదావరి వరద ఉధృతి పెరిగి మండలంలోని ప్రధాన రహదారుల పైకి వరద నీరు చేరడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. రాయనపేట, నెల్లిపాక, గౌరిదేవిపేట, నందిగామ, మురుమూరు గ్రామాలకు వెళ్లే రహదారులపై వరద నీరు చేరింది. నందిగామ, మురుమూరు, చలంపాలెం, ఎర్రగట్టు గ్రామాలకు ప్రత్యామ్నాయ రహదారి లేకపోవడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

విఆర్.పురం : గోదావరి పరివాహక ప్రాంత గ్రామాలు నీట మునగటంతో రేఖపల్లి తహశీల్దారు కార్యాలయం పక్కన మైదాన ప్రాంతంలోనూ, కెజెవిడి, మినీ గురుకులం, ఎంపిడివో ఆఫీస్ పక్కన, సుద్దగూడెం గ్రామం వద్ద బాధితులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మరి కొంతమంది రేఖపల్లిలోని రూములు అద్దెకి తీసుకొని నివాసాలు ఉంటున్నారు. రామవరం పంచాయతీలోని రామవరంపాడు, చొప్పలి, అడవి వెంకన్నగూడెం, సున్నీ వారి గూడెం, చింతరేఖపల్లి, కన్నాయి గూడెం గ్రామ వాసులు అడవిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో అధికారులు బాధితులకు ఎలాంటి వసతులు కల్పించలేదని, పాకలు వేసుకున్న వారికి బరకాలు, కిరోసిన్, దోమ తెరలు, మంచినీరు, పాల ప్యాకెట్లు అందించడం లేదని వారు వాపోతున్నారు. అటవీ ప్రాంతంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసుకున్న తమకు వైద్యం అందించాలని కోరుతున్నారు.

కూనవరం : గోదావరి అంతకంతకు పెరగడంతో టేకులబోరు, కూనవరం ప్రజలు మెల్లగా పునరావాస కేంద్రాలకు చేరుకున్నారు. వీరు నిత్యావసరాలు టేకులబోరు, భీమవరం వెళ్లి తెచ్చుకోవడానికి ప్రత్యేకంగా ఒక బోటుని అధికారులు ఏర్పాటు చేశారు. నిత్యావసర సరుకులు బుధవారం ఇస్తామని చెప్పారు. కూనవరం ఎస్ఐ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయంతో బోట్లను ఏర్పాటు చేశామని, ప్రజలు అవసరాల నిమిత్తం వాడుకోవాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్నా, మెడికల్ అవసరాలకైనా తహశీల్దార్ కంట్రోల్ రూమ్‌కి గాని, తన నెంబర్‌కిగాని ఫోన్ చేయాలని సూచించారు.



విఆర్.పురం మండలంలో వరద ముంపులో ఉన్న గ్రామం



చట్టి జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



సురక్షిత ప్రాంతాలకు ట్రాక్టర్లతో సామాగ్రి తీసుకెళ్తున్న నిర్వాసితులు



ముంపు ప్రాంత ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి- ఎటపాక : మండలంలోని ముంపు ప్రాంతాల్లో అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మంగళవారం పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వరద పరిస్థితిని, సహాయక చర్యలను సమీక్షించారు. వరద బాధితులను కచ్చితత్వంతో గుర్తించి వారికి ఏ ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. వరద ముంపు గ్రామాలకు బియ్యం అందించామని, రాకపోకలకు పడవలు ఏర్పాటు చేశామని, వైద్య సిబ్బంది గ్రామాల్లోనే ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ బియ్యంతో పాటు నిత్యవసరాలు అందరికి అందించాలని, ప్రత్యామ్నాయ రహదారులను పునరుద్ధరించి వరదల సమయంలో రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

ముంపు ప్రాంతాల్లో పశు సంవర్ధకశాఖ అధికారుల సందర్శన

చింతూరు : జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సిహెచ్. నరసింహులు మంగళవారం ముంపు మండలాలను సందర్శించారు. పశువుల యజమానులతో మాట్లాడి వరదలలో పశువులను రక్షించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. వరద తగ్గిన తరువాత ముద్ద చర్మ వ్యాధి టీకాలు పశువులకు వేయించాలని సూచించారు. వరదల అనంతరం వరద ప్రభావిత గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో చింతూరు మండలం సహాయ సంచాలకులు డాక్టర్ యు.వెంకటేశ్వరరావు, మోతుగూడెం పశువైద్యులు డాక్టర్ కె.అన్వేష్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

విఆర్.పురం : కొద్ది రోజులుగా వర్షాలు కురవడం, ముంపు గ్రామాల ప్రజలు రేఖపల్లిలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసుకుంటున్న నేపథ్యంలో ప్రజలు దోమకాటుకు గురికాకుండా ముందుస్తుగా రేఖపల్లిలో పంచాయతీలో సోమవారం పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. సర్పంచ్ పూనెం సరోజినీ, సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ శివప్రసాద్ దగ్గరుండి రేఖపల్లి, గొల్లగూడెం, సుద్ధగూడెం పునరవాస కేంద్రాల వద్ద బిచింగ్ పౌడర్ జల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సరోజినీ మాట్లాడుతూ గోదావరి శబరి నదుల పరివాహక గ్రామాలు మునగటంతో ప్రజలు రేఖపల్లికి వచ్చారని, వారికి ఎలాంటి వ్యాధులు ఈ పనులు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు..

కూనవరం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బురద మాయంగా మారిన కూటూరు గ్రామంలో సర్పంచ్ బొగ్గా వెంకమ్మ పర్యవేక్షణలో బ్లీచింగ్ చల్లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, హరి, మహిళ పోలీస్, సోడే నాగేశ్వరావు పాల్గొన్నారు.



ముంపు గ్రామాలను సందర్శనకు పడవలో వెళ్తున్న సిపిఎం నాయకులు

వరద బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

ముంపు గ్రామాల్లో సిపిఎం నేతల పర్యటన

ప్రజాశక్తి-కూనవరం

వరద ముంపు బాధితులకు బియ్యం, నిత్యవసరాలు, కిరోసిన్, టార్పాలిన్స్ వంటివి ఇవ్వలేదని, తక్షణమే వాటిని పంపిణీ చేయాలని, దోమ తెరలు, మంచి నీళ్లు అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూనవరం మండలం పంద్రాజు పల్లి వద్ద మెయిన్ రోడ్‌లో పాకలు వేసుకున్న శబరి కొత్తగూడెం గ్రామాన్ని సిపిఎం బృందం వరద బాధితులతో మాట్లాడారు. అనంతరం వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారులు వరద బాధితుల పట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా లార్ఫలిన్, నిత్యావసర సరుకులు పంపిణీ చేయలేదన్నారు. దీంతో అర్ధాకాలితో చీకట్లో బిక్కుబిక్కుమంటూ ప్రాణాల అరచేతిలో పెట్టుకొని పాకల్లో గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటూరు హాస్పిటల్‌కి కరెంట్ లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు లోతా రామారావు, జిల్లా నాయకులు పల్లపు వెంకట్, సిసం సురేష్, నాయకులు పాయం సత్యనారాయణ, మడివీ రవితేజ, పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : శబరి, గోదావరి నదులు, వాగులు, గెడ్డలు ఉప్పొంగటంతో మండలంలోని ముంపునకు గురైన గ్రామాలను సిపిఎం నాయకులు మంగళవారం పడవలపై వెళ్లి సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామగిరిలో అనారోగ్యంతో ఉన్న ఎన్.బాబోజి అనే వ్యక్తిని పరామర్శించారు. రేషన్ కార్డు ఉన్న వాళ్లకి మాత్రమే బియ్యం ఇస్తున్నారని, నిత్యావసర సరుకులు కూడా ఇవ్వట్లేదని వాపోయారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ మాట్లాడుతూ కొండలపై గుడారాలు వేసుకున్న వారికి బరకాలు కిరోసిన్ నిత్యవసర వస్తువులు దోమ తెరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి సంతోష్ కుమార్, సిపిఎం నాయకులు సోయం చిన్నబాబు, పంకు, సత్తిబాబు, సోడి మల్లయ్య, పులి ధర్మరాజు, కుంజ కన్నయ్య, జి.లక్ష్మణరావు, తాతబాబు రెడ్డి, కాంతారావు, ప్రకాష్ రావు పాల్గొన్నారు.

చింతూరు : వరద బాధితులకు అన్ని రకాల నిత్యావసర వస్తువులతో పాటు దోమతెరలను అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు లోతా రామారావు, పల్లపు వెంకట్, సీసం సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వరద సహాయక షెల్టర్‌లను సందర్శించారు. పునరావాస కేంద్రాల్లో సదుపాయాల గురించి వరద బాధితులను అడిగి తెలుసుకున్నారు. నిత్యవసర వస్తువులు సరిపడా అందటం లేదని, బాధితులు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు మడివి రవితేజ, కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ వాలంటీర్లను నియమించాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్

ప్రజాశక్తి -పాడేరు: గిరిజన విద్యాసంస్థలలో హెల్త్ వాలంటీర్లను వెంటనే నియమించడంతోపాటు వైద్యశిబిరాలను నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ. అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం అశోక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఇటీవల అనారోగ్యంతో 60 మందికి పైగా గిరిజన విద్యార్థులు చనిపోయారన్నారు .ఇంకా ఎంతో మంది అస్వస్థతకు గురై బాధపడుతున్నారన్నారు.ఈ నేపథ్యం గిరిజన ప్రాంతంలో ఉన్న అన్ని విద్యాసంస్థల్లో హెల్త్ వాలంటీర్లను నియమించాలని, ప్రతి విద్యా సంస్థలలో మెడికల్ క్యాంపు నిర్వహించి మెడికల్ చెకప్ చేయాలని, అదేవిధంగా విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా మెనూ పక్కాగా అమలు చేయాలని కోరారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్స్ స్కూళ్లకు సొంత భవనాలను నిర్మించి, స్థానిక మాతృభాష ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. గిరిజన విద్యార్థులకు ఇంటర్,డిగ్రీ పరీక్ష ఫీజులు, అడ్మిషన్ ఫీజులు తగ్గించాలని, పాడేరు కేంద్రంగా గురుకుల డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, అదనంగా బాలికల గురుకుల కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. గురుకులాల్లో బాలికలకు అదనంగా సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ విద్యార్థులకు కాస్మోటిక్స్, నోట్ బుక్స్, పుస్తకాలు అందజేయాలని కోరారు. అన్ని ఆశ్రమ, గురుకుల,కేజీబీవీ పాఠశాలలో మరుగుదొడ్లలలో రన్నింగ్ వాటర్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, కె.కార్తీక్ శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు పి.చిన్నారావు,సింహాద్రి,నిర్మల పాల్గొన్నారు.

కోనాపురంలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి- అనంతగిరి : మండలంలోని కోనాపురంలో మంగళవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. అనంతగిరి పశువైద్యాధికారి డాక్టర్‌బి.సందీప్ ఆధ్వర్యంలో గ్రామంలో పశువులు, జీవాలకు గాలికుంటు వ్యాధినివారణ వ్యాక్సినేషన్ చేశారు. కోనాపురం, కరాయిగూడ, బోందుగుడ, తదితర గ్రామాలలో పశువైద్య సిబ్బంది సందర్శించి, 105మేకలు, 9 పశువులకు వ్యాక్సినేషన్ చేశారని డాక్టర్ సందీప్ తెలిపారు. మూగజీవాలు అనారోగ్యం చేస్తే నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే అందుబాటులో ఉన్న పశువైద్యశాలకు తీసుకొచ్చి వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు అనిల్, నవీన్ పాడిపశువులు, జీవాల పెంపకందారులు పాల్గొన్నారు



మేకలకు టీకాలు వేస్తున్న సిబ్బంది

రేకుల షెడ్డులోనే చదువులు!

- అర్ధాంతరంగా ఆగిన పాఠశాల భవన నిర్మాణం
- అవస్థలు పడుతున్న బొండగుడ విద్యార్థులు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు, నేతలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలంలోని బస్కీ పంచాయతీ బొండగుడ మండల పరిషత్ పాఠశాలకు పక్కా భవనాలు లేకపోవడంతో తాత్కాలిక రేకు షెడ్డులోనే నిర్వహిస్తున్నారు.. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి రేకులషెడ్ లోపల, బయట అంతా చిత్తడిగా మారడంతో విద్యార్థులు అవస్థలు పడుతూ విద్యాబోధన సాగిస్తున్నారు. ఏళ్లతరబడి ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

మండలంలోని బొండగుడ పాఠశాలలో సుమారు 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే పాఠశాల ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా నేటికీ దీనికి సొంత భవనం లేని పరిస్థితి. 2012-13 పాఠశాల భవన నిర్మాణానికి సర్వ శిక్ష అభియాన్‌లో రూ.16 లక్షల నిధులు మంజూరు అయ్యాయి అరకొరగా పునాదులు, పిల్లర్లు వేసి, తర్వాత అర్ధాంతరంగా వదిలేయడంతో నేటికీ అవి దిష్టిబొమ్మల్లాగే దర్శనమిస్తున్నాయి. చేసిన పనులు కొంచమే అయినా, పనులు పర్యవేక్షించిన అప్పటి .గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై రూ.8.50లక్షల బిల్లులు డ్రా చేసుకుని, తర్వాత నిధులు సరిపోవంటూ పనులు నిలుపుదల చేశారని స్థానికులు అంటున్నారు. ఆ తర్వాత దీన్ని దుస్థితిని ఇటు ప్రజాప్రతినిధులుగానీ, అటు అధికారులుగానీ పట్టించుకోకపోవడంతో నేటికీ అలాగే మొండి పిల్లర్లతోనే దర్శనమిస్తోంది. దీనిపై ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఏ ఒక్కరూ పట్టించుకోలేదని గ్రామస్తులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామస్తులు స్వచ్ఛందంగా నిర్మించిన బొండగుడ పాఠశాల నిర్వహిస్తున్న రేకుల షెడ్



పిల్లర్ల స్థాయిలోనే అసంపూర్తిగా నిలిచిన బొండగుడ స్కూల్ భవనం

స్వచ్ఛందంగా రేకులషెడ్ నిర్మాణం

పాఠశాల నిర్వహణకు వసతి లేని పరిస్థితుల్లో విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని, గ్రామస్తులతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు తలో కొంత విరాళాలు వేసుకుని, స్వచ్ఛందంగా రేకుల షెడ్‌నునిర్మించారు. ప్రస్తుతం ఈ భవనంలోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. అయితే ఎండ ఎక్కువైనా, వర్షం కురిసినా, చలి వేసినా ఈ రేకుల షెడ్‌లో ఉండలేని స్థితిలో మూడుకాలాల్లోనూ విద్యార్థులు అవస్థలు పడుతూ గత్యంతరం లేనిస్థితిలో విద్యాబోధన సాగిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు, నేడు పథకంలో ప్రతిపాదనలు చేసినా, నిధులు మంజూరుకాలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం స్పందించి, బొండగుడలో పాఠశాల భవనం నిర్మాణానికి చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులతోపాటు ఉపాధ్యాయులు వేడుకుంటున్నారు.

ముంపు పొలాలను అధికారుల పరిశీలన

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీటమునిగిసి ఆదివాసి గిరిజన రైతులకు చెందిన వరి, వేరుశనగ, మొక్కజొన్న, రాగులు, సామలు తదితర చిరుధాన్యాల పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త . డాక్టర్ ప్రదీప్ రైతు సేవ కేంద్రం వ్యవసాయ సహాయక సిబ్బంది మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

ఈసందర్భంగా ఎఒ శ్రీనివాసబాబు మాట్లాడుతూ, అకాల వర్షాలతో పంటనష్టాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలనకు వచ్చి, కరిముఖిపుట్టు, కించాయిపుట్టు గ్రామ పంచాయతీల పరిధిలో పర్యటించి పరిశీలించా మన్నారు. ప్రస్తుతం వర్షాలు, నీటిముంపు ఎక్కువగా ఉండడంతో పంటనష్టాలను అంచనా వేయలేక పోతున్నా మన్నారు. ఇప్పటివరకు మండలంలో 25 గ్రామాలలో 280 హెక్టార్లలో పంటనష్టం జరిగినట్లు గుర్తించామని, అన్ని గ్రామాల్లో పరిశీలన తర్వాత పూర్తి నివేదికను ఉన్నతా ధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.




పంటనష్టాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాస్త్రవేత్త, అధికారులు

పంచాయతీ నిధులు స్వాహా చేసిన

సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలి

పద్మాపురం పంచాయతీ ఉపసర్పంచ్, వార్డు సభ్యుల నిరసన



మండల పరిషత్ వద్ద నిరసన చేపడుతున్న పంచాయతీ సభ్యులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్ : అరకులోయ మండలం పద్మాపురం మేజర్ పంచాయతీ అభివృద్ధి కోసం కేటాయించిన సాధారణ నిధులను స్వాహా చేసిన సర్పంచ్ పెట్టెలి సుస్మితపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపసర్పంచ్ , వార్డు సభ్యుల, సెక్రటరీ సంతకాలు, వారి ప్రమేయం లేకుండా 2020-24 వరకు సాధారణ నిధులు, 15 ఆర్థిక సంఘం నిధులను సర్పంచ్ స్వాహా చేసారని ఆరోపించారు. దీంతో నిధుల లేమితో పంచాయతీలో డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్య పనులకు నిధులు లేక అస్తవ్యస్తంగా మారిందన్నారు. దీనిపై గతంలో పలుసార్లు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 12న జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేయగా, మంగళవారం చేపట్టాల్సిన విచారణ వివిధ కారణాలతో వాయిదా పడిందన్నారు విచారణకు వచ్చిన వారంతా మండల పరిషత్ వద్ద నిరసన చేపట్టి, సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో వైస్ సర్పంచ్ జన్నీ భగత్ రాం, వార్డు సభ్యులు, కొండమ్మ, ఎస్ సుందరమ్మ, కె మంగ్లి, ఎం దేవక, పి రవి, షేక్ యాసిన్, శీలం కొండలరావు, పి చిన్ని, పి సింహాద్రి, పాల్గొన్నారు.

జిప్ లైనుకు బొర్రా పంచాయతీ నోటీసులు

ప్రజాశక్తి -అనంతగిరి : పర్యాటక కేంద్రం బొర్రాలో ఎటువంటి అనుమతులు లేకుండా, ఏజెన్సీ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన జిప్‌లైన్‌కు బొర్రా పంచాయతీ నోటీసులు జారీ చేసింది ఈ సందర్భంగా సర్పంచ్ జన్ని. అప్పారావు మాట్లాడుతూ గిరిజన హక్కులు, చట్టాలను తుంగలో తొక్కి ఎటువంటి పంచాయతీ అనుమతులు లేకుండా, పర్యటన శాఖ నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరుడు జిప్‌లైన్ ఏర్పాటుచేసి, ప్రజాధనాన్ని దోచుకుంటు న్నాడని, పంచాయతీకి పైసా సెస్, ఇతర రూపంలో ఆదాయం చేకూర్చడం లేదన్నారు గడచిన ఎనిమిది నెలల్లోనే దాదాపు రూ.2.51కోట్లను అక్రమంగా సంపాదించాడన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న దీన్ని పంచాయతీపరంగా స్వాధీనం చేసుకుని, పూర్తి అనుమతులతో కొనసాగిస్తామన్నారు. ఈ మేరకు సంబంధిత నిర్వాహకులు లేకపోవడంతో జిప్‌లైన్ వద్దనోటీసులు అతికించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు సమరెడ్డి సింహాద్రి, పంచాయతీ నాయకులు. నవీన్, ధనియాలు, సచివాలయ సిబ్బంది బొర్రా గైడ్స్ యూనియాన్ సిబ్బంది పాల్గొన్నారు



నోటీసులు అతికిస్తున్న సిబ్బంది

చెట్లు కూలి ఇళ్లకు తీవ్ర నష్టం


ముంచంగిపుట్టులో ఇళ్లపై కూలిన చెట్లు

ప్రజాశక్తి -యంత్రాంగం

ముంచింగిపుట్టు: మండలంలోని వనగుమ్మ పంచాయతీ వనస గ్రామం మంగళవారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలకు మర్రి చెట్టు విరిగి మూడు ఇళ్లపై పడడంతో అవి ధ్వంసమయ్యాయి. గ్రామం మధ్యలో ఉన్న చెట్టు విరిగి, కిరసాని రోయిలా రేకులు, ఉపేళ్ళ మహదేవ్ పెంకుటిల్లు, కిరసాని దాన్‌మెట్టి పెంకుటిల్లుపై పడడంతో అవి ధ్వంసం వాయ్యాయి. అయితే ఈ ప్రమాదంలో ప్రాణాపాయం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. గ్రామస్తులు వెంటనే స్పందించి, ఇళ్లపై కూలిన చెట్టును తొలగించారు. అయితే ఆయా ఇళ్లకు, ఇతరత్రా ఆస్తులకు నష్టం వాటిల్లింది. సిపిఎం మండల కమిటీ సభ్యుడు కొర్ర శంకరరావు ఫోను ద్వారా బాధితుల వివరాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు.

పెదబయలు: మండలంలోని మారుమూల బొంగరం పంచాయతీ కుంటిమామిడి గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వన లక్ష్మి తెల్ల దంపతుల ఇంటిపై పెద్ద వక్షం కూలింది. దీంతో ఇంటికి తీవ్రనష్టం వాటిల్లింది. అర్ధరాత్రి వేళ ఇంటిపై చెట్టుకూలడంతో ఎవరూ సాయం చేసే పరిస్థితి లేకపోవడంతో రాత్రంతా బాధితులు ఇంట్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. అలాగే సీతగుంట పంచాయతీ రోగుల కాలనీ జంక్షన్‌లో జులబు ప్రభాకర్, పూర్ణయ్య అన్నదమ్ములకు చెందిన చిన్నషెడ్డుపై పెద్దచెట్టు కూలి, తీవ్రనష్టం జరిగింది. అలాగే మెయిన్ రోడ్డు కిరువైపులా పలు చెట్లు రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తమను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని బాధితులతోపాటు స్థానికులు కోరుతున్నారు.


దేవీపట్నంలో వర్షాలకు కూలిన ఇంటిగోడ

కూలిన పెంకుటిల్లు

దేవీపట్నం : దేవీపట్నం మండలం ఇందుకూరుపేటలో భారీ వర్షాలకు మాదాసు సుబ్బలక్ష్మి పెంకుటిల్లు రెండు గోడలు రాత్రి సమయంలో కూలిపోయాయి. ఈ ఇంట్లో ఐదు సంవత్సరాలుగా పోతవరం గ్రామస్తులు కారం శ్రీరామ్మూర్తి దొర భార్య అన్నారం, కుటుంబ సభ్యులు అద్దెకు ఉంటున్నారు. సోమవారం రాత్రి ఇంటి గోడలు కూలిన సమయంలో కారం శ్రీరామ్మూర్తి కుటుంబ సభ్యులు మెలకువగా ఉండడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. గోడలు కూలడంతో ఇంట్లో ఉన్న రెండు బీరువాలు, డబల్ కాట్ మంచం, డ్రెస్సింగ్ టేబుల్ తదితర వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. డ్రైనేజీ లేకపోవడంతోనే ఇంటి గోడలు కూలిపోతున్నట్లు స్థానికులు చెప్పారు. ఇప్పటికైనా పంచాయతీ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులకు తక్షణమే స్పందించి సీసీ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఇంటి గోడలు కూలి ఆస్తి నష్టం కలిగింది బాధితులకు తక్షణమే ఆర్థిక సహాయం చేయాలని కోరారు.


పెద్దబయలులో చెట్టు కూలడంతో ధ్వంసమైన ఇళ్లు

వర్షాలకు ఎగిరిపడిన సోలార్ ప్లేట్

దుంబ్రిగుడ : మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామంలో తాగునీటి పథకానికి ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్ ఎగిరి కిందపడ్డాయి. దీంతో గ్రామంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకొని స్థానిక సిపిఎం మండల నాయకుడు తిలక్ గ్రామంలో సందర్శించి సోలార్ ఏర్పాటుచేసిన గ్రావిటీ పథకాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులు స్పందించి, మరమ్మతులు చేపట్టి, నీటి కొరత తీర్చాలని కోరారు.


నేలకూలిన సోలార్ ప్లేట్


రోగులను పరీక్షిస్తున్న ఈదులపాలెం వైద్యాధికారినరసింహారావు

గుర్రగరువులో 40 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -పాడేరు : మండలంలోని మోదాపల్లి పంచాయతీ గుర్రగరువు గ్రామంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి 40 మందికి వైద్య సేవలు అందించారు. గుర్రగరువు గ్రామంలో జ్వరాలు ఉన్నాయనిఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్‌కు సమాచారం రావడంతో, ఆయన వెంటనే వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసారు. పిఓ ఆదేశాల మేరకు ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నరసింహరావు ఆధ్వర్యంలో గుర్రగరువు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికి జ్వరాలపై సర్వే చేసి, 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్‌టిటి పరీక్షలు నిర్వహించగా మలేరియా నెగిటివ్ వచ్చిందన్నారు. సాధారణ జ్వరాలతో బాధపడుతున్న ఆరుగురికి వైద్య పరీక్షలుచేసి, మందులు అందించారు. రక్తపూతలు సేకరించారు. ఈసందర్భంగా డాక్టర్ నరసింహరావు మాట్లాడుతూ, వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు, సాధారణ జ్వరాలు, చర్మ వ్యాధులతో పలువురు బాధపడుతున్నారని, దోమ తెరలు వాడడం, కాచిచల్లార్చిన నీరు,వేడి ఆహారం భుజించడం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో యాంటీ లార్వా ఆపరేషన్ చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ ఎస్ వరహాల నాయుడు, హెచ్‌వి. కొండమ్మ, ధనుంజయ్, సోముదొర పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి -చింతపల్లి : ఆధార్ నమోదు, అప్‌డేట్ కోసం ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని చింతపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ దురియా పుష్పలత కోరారు. పంచాయతీ పరిధిలోని ఒకటో సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను సందర్శించారు. సచివాలయం -1 లో 23, 24 తేదీలోనూ, 25వ తేదీన సచివాలయం - 3లో, 26, 27 తేదీలలో సచివాలయం -2లో ఆధార్ నమోదు కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, ఆధార్‌లో తప్పొప్పులు సవరణ, అప్‌డేట్, కొత్తగా నమోదు, ఇతర అవసరాలను వాటిని వినియోగించుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆశా కార్యకర్త దుర్మరణం

ప్రజాశక్తి దుంబ్రిగుడ: మండలంలోని అరకు, పాడేరు జాతీయ రహదారిలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గిరిజన మహిళ మృతి చెందింది. వివరాలివి. కిల్లోగుడ పిహెచ్‌సి పరిధిలోని నేరుడువలస ఆశా కార్యకర్త పాంగి తులమ్మ (48) అనే గిరిజన మహిళ రోడ్డు దాటుతుండగా అరకు వైపు నుంచి పాడేరు వెళ్తున్న వాహనం బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. రక్తపుమడుగులో కొట్టుమిట్టాడుతున్న ఆమెకు స్థానికులు సపర్యలు చేసినా ఫలితం లేక, సంఘటనాస్థలిలోనే మృత్యువాత పడింది. దీంతో బాధిత కుటుంబీకులు బోరున విలపించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్థానికులు వెంబడించినా ఫలితం లేకపోయింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రవాణా సౌకర్యం లేకే ప్రాణాలకు ముప్పు

అధికారులు స్పందించాలి : ఐద్వా

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న సమయంలో మారుమూల గిరిజన గ్రామాలకు కనెక్టవిటీకి రోడ్డు, రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్లే గిరిజనుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోందని ఆదివాసి గిరిజన మహిళా సంఘం (ఐద్వా) మండల అధ్యక్షురాలు ఈశ్వరి, కార్యదర్శి సీసా విజయ ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీపురం పంచాయతీ కోడపుట్టు గ్రామానికి చెందిన కొర్ర సొనాయి అనే గర్భిణి ప్రసవ వేదన పడుతూ, సకాలంలో ఆసుపత్రిలో వెళ్లలోనే గర్భంలోనే బిడ్డను కోల్పోవడంతోపాటు అతికష్టం మీద ప్రాణాలతో బయటపడిందన్నారు .ఇటువంటి ఘటనలు ఏజెన్సీలో నిత్యకృత్యంగా మారుతున్నా ఏళ్లతరబడి అధికారులు, నేతలు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. మండలంలోని అతిమారుమూల ప్రాంతాలైన లక్ష్మీపురం, బుంగాపుట్టు, బూసిపుట్టు, బరడ, కుమడ, బాబుసాల తదితర పంచాయతీ గ్రామాలలో కనెక్టివిటీ రోడు, వంతెనలు, బ్రిడ్జిలు లేక రాకపోకలకు పడే ఇక్కట్లుతో ఆదివాసి గిరిజన గర్భిణులు, బాలింతలతోపాటు అనారోగ్యపీడితులు అనుదినం పడుతున్న కష్టాలను పట్టించుకునే దిక్కులేదని వాపోయారు. లక్ష్మీపురం పంచాయతీ చెందిన కోడపుట్టు గ్రామంలోని కొర్ర సొనాయి గర్భిణికి శుక్రవారం అర్ధ రాత్రి నుంచే పురిటినొప్పులు ప్రారంభమైనప్పటికీ, వర్షాలకు గ్రామం జలదిగ్బంధం కావడంతో ఆసుపత్రిలో వెళ్లలేని పరిస్థితుల్లో మూడురోజులపాటు ఆదివారం మధ్యాహ్నం వరకు ఆమె పడ్డ నరకయాతన చెప్పలేమన్నారు. చివరకు పక్క గ్రామం నుంచి అద్దెకు ప్రైవేటు జీపును తెచ్చి, ఒడిశా బెజ్జంగి మీదుగా 70 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసి, ఆదివారం సాయంత్రానికి ముంచంగిపుట్టు సిహెచ్‌సికి ప్రసవ వేదన పడుతున్న తన భార్యను తెచ్చేందుకు ఆమె భర్త పడ్డ కష్టం సైతం వర్ణనాతీతం. సిహెచ్‌సిలో వైద్యాధికారులు పరిశీలించి, అప్పటికే ఆమె గర్భంలోని శిశువు మృతి చెందినట్లు నిర్ధారించి, ప్రభుత్వ అంబులెన్స్ ద్వారా పాడేరు జిల్లా ఆసుపత్రికి పంపించారు. అక్కడ వైద్యులు గర్భిణికి ఆపరేషన్ చేసి మృత శిశువును బయటకు తీసి, గర్భిణి ప్రాణాలను మాత్రం కాపాడగలిగారన్నారు. ఇలాంటి ఘటనలు ఏటా జరుగుతున్నా, ప్రభుత్వాలు, పాలకులు గిరిజనులు పట్ల ఇంకా నిర్లక్ష్యధోరణితోనే వ్యవహరించడం దుర్గాగ్గమని ఐద్వా నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. తాజా ఘటనతోనే ప్రభుత్వ యంత్రాంగం కళ్లు తెరవాలని, ఆయా గ్రామాలకు రోడ్డు, రవాణా సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటిడిఎ పిఒ అభిషేక్, ఇతర అధికారులను అలాగే గిరిజన ప్రజాప్రతినిధులను ఐద్వా నేతలు కోరారు. కార్యక్రమంలో మహిళా సంఘం మండల కమిటీ సభ్యులు గొల్లోరి లక్ష్మి, గొల్లోరి రాధమ్మ, గొల్లోరి బుజ్జి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐద్వా నేత ఈశ్వరి


వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

చైతన్య నగర్‌లో శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి పంచాయతీ చైతన్య నగర్ కాలనీ వాసులకు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఆ గ్రామ గిరిజనులు సోమవారం స్థానిక తాహాశీల్దార్ కార్యాలయం వద్ద అధికారులకు వినతిపత్రం అందించారు. కాలనీ ఏర్పడి 40 సంవత్సరాలు దాటినా నేటికీ శ్మశాన వాటిక లేకపోవడం వలన గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ నాయకులు తెడ్ల రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే శ్మశాన వాటిక కొరకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని, లేకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు తెడ్ల రాజేష్, తీగల దుర్గ ప్రసాద్, పొడుగు మల్లికార్జున్, పుసం లొవకుమార్, తెడ్ల శ్రీకాంత్, మొసరి కృష్ణ, బచ్చుల తాతారెడ్డి, కొండోజు ప్రకాష్, తొంట శివ, బాబి, తెడ్ల ఇంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-సీలేరు : వారం రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మారుమూల గ్రామాల గిరిజనుల అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. జీకే వీధి మండలం దుప్పులవాడ పంచాయతీ వలసగెడ్డ, వలస గెడ్డ కొత్తూరు, బూసి కొండ, సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంప్, జిడిసి క్యాంప్, చంద్రుపల్లి, లైకాన్ పూర్ తదితర గ్రామాలను ఎస్ఐ సందర్శించి ప్రజలతో మాట్లాడారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపల వేటకు వెళ్లరాదని గిరిజనులకి సూచించారు. చిన్నపిల్లలు, విద్యార్థులు గెడ్డలు వాగులు దగ్గరికి వెళితే ప్రమాదాలు సంభవిస్తాయని తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పోలీసుల నుంచి సహాయం కావాలంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆధార్ సేవలు ప్రారంభం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ దుర్జో మాట్లాడుతూ ఆధార్ కార్డుల అప్డేట్, ఫోన్ నెంబర్ యాడింగ్, కొత్త కార్డులు నమోదు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంప్, లైకాన్ పూర్, చంద్రపల్లి, పిఆర్‌సి క్యాంప్, పార్వతి నగర్, జిడిసి క్యాంప్ ప్రజలు, ఏపీ జెన్కోతో పాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ఆధార్ సేవను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ గుమస్తా ప్రకాష్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుసుమ, మహిళా పోలీసు రేవతి, డిజిటల్ అసిస్టెంట్ విజయ కుమారి, లోవకుమారి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి పెద్దపీట : ఎమ్మెల్యే శిరీషాదేవి

ప్రజాశక్తి రంపచోడవరం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఎపికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపి పునర్నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు, వైజాగ్ -చెన్నై పారిశ్రామిక కారిడార్ నిర్మాణానికి అధిక నిధులు కేటాయింపు, వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

అన్ని పంచాయతీల్లోనూ ఆధార్ క్యాంపులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మండలంలో ప్రతి గ్రామ పంచాయితీలోనూ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎ.వీర కిషోర్, ఏబీఎఫ్ ఎం.మనస్విని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారేడుమిల్లి మండలంలో 12 పంచాయతీల్లో కొత్తగా ఆధార్ కార్డు తీసుకొని అప్డేట్ చేయడంతో పాటు ఇంటి అడ్రస్, వయస్సు, పేరు మార్పు, కొత్త ఆధార్ కార్డు నమోదు చేయడం వంటి సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

మోసపూరిత బడ్జెట్ : సిపిఎం

ఎంవిపి.కాలనీ, అనకాపల్లి విలేకరులు : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను మోసపూరితమైనదిగా సిపిఎం విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం, పి.అప్పలనర్స పేర్కొన్నారు. ఈ మేరకు వారు వేర్వేరుగా మంగళవారం ప్రకటనలు విడుదల చేశారు. తాజా బడ్జెట్‌లో విశాఖకు, ఉత్తరాంధ్రకు నిధులు కేటాయించకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం మరోసారి దగా చేసిందని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ నుంచి ఉపసంహరిస్తూ ప్రకటన చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. బడ్జెట్ నుంచి ప్లాంట్‌కు నిధులు కేటాయించకుండా తీవ్ర ద్రోహం చేశారని తెలిపారు. ఉక్కుపై మంచి వార్తను ఆశించిన ప్రజలకు, కార్మికులకు నిరాశే మిగిలిందని తెలిపారు. ఈ ద్రోహంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకుండా రాజధానికి ఆర్థిక సహాయం చేస్తున్నారని తబ్బిబ్బయిపోతూ కేంద్ర ప్రభుత్వాన్ని కీర్తించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. విభజన హామీలలో ఒకటైన విశాఖ మెట్రో రైలుకు ఈ బడ్జెట్‌లో మొండిచేయినే మిగిలిందన్నారు. విశాఖ రైల్వే జోన్ ఊసే లేకుండా పోయిందని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మాటలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. గిరిజన యూనివర్శిటీకి ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా యుజిపి అకౌంట్‌లో కలపడం ద్వారా తీవ్ర హానిచేసిందన్నారు. భోగాపురం విమానాశ్రయం నుంచి విశాఖకు తీరప్రాంత రోడ్డు నిర్మాణానికి కూడా నిధులు కేటాయించలేదని తెలిపారు. విశాఖ స్మార్ట్ సిటీకి మొండిచేయి చూపారన్నారు. విశాఖలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థకీ బడ్జెట్ సపోర్టు అకౌంట్ నుండి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. వాస్తవానికి రాష్ట్రానికి కేటాయించే నిధులు స్పష్టంగా పేర్కొనబడలేదని తెలిపారు.

వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డుంబ్రిగుడ పిహెచ్‌సి వైద్యాధికారి పి రాంబాబు కోరారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వర్షాలతో మురుగునీరు ఎక్కడికక్కడే నిల్వ ఉండి, దోమల ఉవృద్ధి చెంది డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. నివాస పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు.కాచి చల్లార్చిన నీటిని ఎప్పటికప్పుడుతాగాలని సూచించారు.అలాగే పిహెచ్‌సి పరిధిలో లెప్రసీ సర్వే జరుగుతోందని, శరీరంపై స్పర్శలేని మచ్చలు, ఇతర లక్షణాలున్న వారు పరీక్ష చేయించుకోవాలన్నారు. యాభైఏళ్లు పైబడిన వారికి క్షయవ్యాధి నిర్మూలనకు ఉచిత బిసిజి వ్యాక్సినేషన్ చేస్తున్నామని వాటిని వినియోగించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ శౌరి, హెల్త్ అసిస్టెంట్లు రవీంద్ర, స్వామి, ప్రభాకర్, సంజీవ్, గురు పాల్గొన్నారు.



వైద్యానికి దాతలు సహకరించాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్న తమ కుమారుడి వైద్యానికి దాతలు సహకరించాలని ఓ గిరిజన మహిళ వేడుకుంటుంది. మండలంలోని కిర్రాబు పంచాయితీ బొడ్లగొంది గ్రామానికి చెందిన కాకర పార్వతి మొదట సంతానమైన కాకర వరప్రసాద్ రెడ్డి తాళ్లపాలెం ఎంపీపీ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. పార్వతి భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో పార్వతి తన ఇరువురు పిల్లలను కూలి పని చేసుకుంటూ పోషించుకుంటుంది. అయితే వరప్రసాద్ రెడ్డి కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నాడు. ఇటీవల విద్యార్థి పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో రాజమండ్రి జిఎస్ఎల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో చికిత్స పొందుతున్న వరప్రసాద్ రెడ్డికి ఆపరేషన్ నిమిత్తం సుమారు రూ.1.50 లక్షలు వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. దీంతో దిక్కుతోచని స్థితిలో తల్లి పార్వతి తమ బిడ్డ వైద్యానికి దాతలు ఆర్థికంగా సహకరించి ఆదుకోవాలని వేడుకుంటుంది. ఈ నేపథ్యంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, విజయభాస్కర్ రూ.10వేలు, బాటూ, కిర్రాబు మాజీ సర్పంచ్ లోచల రాజుబాబు, నరేంద్ర, సత్తిబాబు, గ్రామస్తులు ఆధ్వర్యంలో సేకరించిన ఆర్థిక సహాయాన్ని విద్యార్థి తల్లికి సోమవారం అందజేశారు.

జల విద్యుత్ కేంద్రంలో మరమ్మతు పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీలేరు : సీలేరు జల విద్యుత్ కేంద్రాన్ని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు మంగళవారం సందర్శించి యూనిట్ మరమ్మతు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండు, నాలుగు యూనిట్ సంబంధించి (బస్ డెక్టు) నుంచి వాటర్ చిమ్మి చెమ్మ చేరడంతో స్టార్టర్ ఎర్త్ సమస్య తలెత్తుందని పేర్కొన్నారు. దీని కారణంగా యూనిట్ మేకర్ వాల్యూ పడిపోయి సాంకేతిక లోపాలు తలెత్తినట్లు చెప్పారు. మేగ్గర్ వ్యాల్యూ రావడానికి స్టార్టర్ హీట్ చేస్తున్నామని, దీనికోసం శ్రీశైలం నుంచి హీట్ బ్రోయర్ తెప్పిస్తున్నామని తెలిపారు. పనులు శరవేగంగా చేయటానికి ఎంత ప్రయత్నం చేసినా వాతావరణ సహకరించకపోవడం వల్ల పనులు జాప్యం జరుగుతున్నాయని పేర్కొన్నారు. బస్ డెక్ట్ లోకి నీరు ప్రవేశించకుండా సివిల్ అధికారులు స్పెషల్ కెమికల్ అప్లై చేసినప్పటికీ వాతావరణ అనుకూలంగా లేకపోవడంతో డ్రై అవ్వడం లేదన్నారు. మంగళవారం మధ్యాహ్నం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కెమికల్ మళ్లీ అప్లై చేయడం జరిగిందన్నారు. అర్ధరాత్రికి రెండో యూనిట్, మరొక రెండు రోజుల్లో 4 యూనిట్ వినియోగం తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మొదటి యూనిట్ మరమ్మతు పనులు నెలాఖరులోగా పూర్తి చేసి వచ్చే నెల మొదటి వారంలో వినియోగంలో తెస్తామన్నారు. కార్యక్రమంలో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్సీ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈలు బాలకృష్ణ ప్రభాకర్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


పనుల తీరును పరిశీలిస్తున్న అధికారులు

చేపల వేటకు వెళ్లి గెడ్డలో గల్లంతు

ప్రజాశక్తి - సీలేరు : చేపల వేటకు వెళ్లి బాబురావు అనే వ్యక్తి గెడ్డ ప్రవాహానికి గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ టిఆర్‌సి క్యాంపు గ్రామానికి చెందిన బాబురావు జల విద్యుత్ కేంద్ర వద్ద నూకాలమ్మ గుడి సమీపంలోని గెడ్డలో సోమవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలోనే అధికంగా వర్షం పడుతున్న లెక్కచేయకుండా చేపలు వేటాడేందుకు గెడ్డ ఒడ్డు నుంచి దిగేందుకు ప్రయత్నం చేస్తుండగా, ప్రమాదవస్తు కాలు జారి గెడ్డలోకి దొరిలిపోయి, నదీ ప్రవాహానికి కొట్టుకుపోయాడు. బాబురావు గెడ్డలో కొట్టుకుపోవడాన్ని కొందరు గమనించి బంధువులకు సమాచారం ఇచారు. బాబురావు ఆచూకీ గురించి గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో బంధువులు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాలు వేయాలి

ప్రజాశక్తి-కూనవరం : గోదావరి నీటి మట్టం 40 అడుగులకు వస్తే మండలంలోని గొమ్ముయ్యవారిగూడెం గ్రామానికి వచ్చే విద్యుత్ స్తంభాల ద్వారా విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని, అందువల్ల ఎత్తైన ప్రాంతాల నుండి విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు స్థానిక భీమవరం విద్యుత్ కార్యాలయంలో లైన్ ఇన్స్పెక్టర్‌కి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి విద్యుత్ లైను పంట పొలాల నుండి వస్తుందని, అది పల్లపు ప్రాంతంలో ఉండటం వల్ల గోదావరి వరదలు వచ్చినపుడు 40 అడుగులకే కరెంటు పోయి చీకట్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 2022 వరదలకు 20 రోజుల పాటు చీకట్లో పిల్లలతో ఉన్నామని, దోమలతో ఇబ్బంది పడ్డామని పేర్కొన్నారు. దీనిపై విద్యుత్ అధికారులకు, నాయకులకు తెలియ చేసిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా తమ గ్రామానికి ఎత్తయినా ప్రాంతం నుండి స్తంభాలు వేసి విద్యుత్ అందించాలని కోరారు.

వాగు దాటేందుకు తాడే ఆధారం

ప్రజాశక్తి-కొయ్యూరు : గడిచిన వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏజెన్సీలో వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో వాగులపై వంతెనలు లేక తాళ్లు కట్టుకొని వాగులు దాటాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని పలకజీడి గ్రామం నుంచి గంగవరం, గొల్లబంద, నీలవరం, పాలసముద్రం, మర్రిపాకల, ఎర్రగొండ, తీగలమెట్ట, జెర్రిగొంది తదితర గ్రామాలకు చేరుకోవాలంటే మధ్యలో వాగు ఉంది. ఆ వాగుపై వంతెన లేకపోవడంతో రెండు వైపుల ఒడ్డునున్న చెట్లుకు తాడును కట్టి ఆ తాడు సహాయంతో ప్రమాదకరంగా ఉన్న ఈ గెడ్డ దాటుతున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మారుమూల గిరిజన గ్రామాలకు కనీస సౌకర్యాలు లేక నానా తిప్పలు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ వాగుపై వంతెన నిర్మించాలని ఆ పరిసర ప్రాంత గ్రామ గిరిజనులు కోరుకుంటున్నారు.

గెడ్డలు దాటి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

కొయ్యూరు మండలంలో వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మండల తహసీల్దార్ డి.రాజేశ్వరరావు, ఎస్సై రామకృష్ణ సూచించారు. పెదమాకవరం, రామరాజుపాలెం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. వర్షాలకు ఎక్కడికక్కడ కొండవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో ఎవరూ సాహసించి గెడ్డలు దాటి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని హితవు పలికారు.

వర్షాల వల్లే రోడ్డు నిర్మాణం జాప్యం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని మూలపేట పంచాయితీ, మారుమూల జాజులబంద గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం లేదని, కేవలం వర్షాల వల్లే జాప్యం జరుగుతుందని మండల ఇంజనీరింగు అధికారి రామకృష్ణ తెలిపారు.ఎన్ఆర్ఇజిఎస్ నిధులు కోటి రూపాయలతో జాజులబంద గ్రామానికి సుమారు 6కిలో మీటర్లు మేర 200 మీటర్ల పొడవుగల గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 4 కల్వర్టులతో కూడిన 3కిలోమీటర్ల పొడవున రూ.29లక్షల విలువగల గ్రావెల్ రోడ్డును నిర్మించామని, అయితే ఈలోగా తుఫాన్ ప్రభావంతో కొన్నిరోజులుగా భారీవర్షాలు కురుస్తుండటంతో రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం, అంతరాయం కలిగాయని చెప్పారు. వర్షాలు తగ్గితే మళ్లీ పనులను కాంట్రాక్టరుతో పున:ప్రారంభింపజేస్తామని పేర్కొన్నారు. రెండుచోట్ల పెద్దపెద్ద రాయిపనుకులు ఉండటంతో వాటిని బ్లాస్టింగ్ చేసేందుకు శాఖాపరమైన అనుమతికై స్థానిక పోలీసులను కోరనున్నట్టు తెలిపారు. రోడ్డు నిర్మాణంలో ఎటువంటి ఉద్దేశ్యపూర్వక జాప్యంగాని, నిర్లక్ష్యంగాని ఉండబోదని ఆయన వివరించారు.